సజ్జ రైతుకు కన్నీరే మిగిలింది..!




కంకులు రాలిన, మొలకెత్తిన సజ్జ కండెలు

- నియోజక వర్గంలో 1,307 హెక్టార్లలో పంటనష్టంగా ప్రాథమిక అంచనా
- చేతి కొచ్చిన పంట నీరు గారిన వైనం

కనిగిరి రూరల్: వాయుగుండం ప్రభావంలో ఇటీవల కురిసిన వర్షానికి అనేక పంటలు దెబ్బతిన్నాయి. అందులో కనిగిరి నియోజకవర్గంలో 1,307 హెక్టార్లు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. దీంతో సజ్జ రైతులు కన్నీరే మిగిలింది. వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో 20,928 హెక్టార్లు ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం కాగా, 17,627 హెక్టార్లు సాగు విస్తీర్ణం నమోదైంది. అయితే వీటిలో ప్రధాన పంటగా కంది 5,477 హెక్టార్లు సాగు చేయగా సజ్జ సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ మేరకు గత రెండ్రోజులుగా వ్యవసాయ, రెవెన్యూ అధికారుల బృందం, గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్ట పరిహారానికి సర్వేలు చేస్తున్నారు.

చేతికొచ్చిన పంట..

అరుగాలం శ్రమించి పండించి పంట చేతికొచ్చె సమయానికి అకాల వర్షం ధాటికి నీరు గారిపోవడంతో రైతన్న కన్నీటితో బావురుమంటున్నాడు. కనిగిరి డివిజన్‌లోని ఆరు మండలాల్లో సజ్జ 1,678 హెక్టార్లు సాగు చేశారు. అయితే అందులోని వెలిగండ్ల, హెచ్‌ఎంపాడు మండలాల్లోని సజ్జ పంట ఎక్కువగా దెబ్బతింది. వెలిగండ్ల మండలంలో 1,204 హెక్టార్లు దెబ్బతినగా, హెచ్‌ఎంపాడు మండలంలో 86 హెక్టార్లు, కనిగిరిలో 9 హెక్టార్లు, సీఎస్‌పురంలో 8 హెక్టార్లు సజ్జ పంట కోత, కుప్ప దశలో నష్టం జరిగింది. కొన్ని చోట్ల సజ్జ కంకులు బుట్టపైనే వర్షం ధాటికి మొలకెత్తాయి.

కోత జరిగి కుప్ప వేసిన పంటకూడా మొలకెత్తి చేతికి రాకుండా పోయింది. సబ్ డివిజన్‌లో మొత్తం 1,307 హెక్టార్లలో సజ్జ పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులకు ప్రాథమిక అంచనా తెలిపారు. అలాగే పామూరు మండలంలో ఎర్లీ రబీ కింద వేసిన సుమారు 279 హెక్టార్లు మినుము పైరు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే పలు చోట్ల కంది, పొగాకు, మిరప పైర్లలో నీరు నిలిచి ఉరకెత్తాయి. కంది పైరుకు ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.



దెబ్బతిన్న సజ్జ పంట పైరు

ఆలయానికి చెందిన 11 దుకాణాలు స్వాధీనం

- దుకాణాల స్వాధీనంలో స్వల్ప ఉద్రిక్తత
- ఒక దుకాణానికి కోర్టు స్టే

పామూరు: స్థానిక వల్లీ భుజంగేశ్వర ఆలయానికి చెందిన దుకాణాలకు ఎండోమెంట్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..ఆలయానికి చెందిన 12 దుకాణాలు నడిబొడ్డున ఉండగా మూడున్నర దశాబ్దాల కాలంగా వాటిలో కొందరు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వారిలో కొంత మంది బాడుగ చెల్లిస్తుండగా, మరికొందరు బాడుగలు చెల్లించడంలేదు. దీంతో ఆలయంలో దూప దీపాలు కష్టంగా మారగా దుకాణాల నిర్వాహకులు ఆ దుకాణాలు మావేనని కొంతకాలంగా వాదిస్తున్నారు. దీంతో పలుసార్లు నోటీసుల అనంతరం గురువారం ఎండోమెంట్ ఏసీ ఎం పానకాలరావు, సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి, స్థానిక ఆలయ ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబుల ఆధ్వర్యంలో ఆలయ దుకాణాలను ఖాళీచేయించే ప్రక్రియను పోలీసుల బందోబస్తు నడుమ చేపట్టారు. ఈ సందర్భంలో అధికారులకు దుకాణం నిర్వాహకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దుకాణ నిర్వాహకులు తాము 35 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నామని, కొంత సమయం ఇవ్వాలన్నారు. పోలీసుల సహకారంతో దేవాదాయశాఖ సిబ్బంది దుకాణాల్లోని సామాన్లను బయటపెట్టడంతో మిగిలిన దుకాణం నిర్వాహకులు వారే స్వయంగా తమ దుకాణాల్లోని సరుకులను, వస్తువులను తీసుకెళ్లడంతో దుకాణాల స్వాధీన ప్రక్రియ త్వరితగతిన ప్రశాంతంగా ముగిసింది. ఖాళీచేసిన దుకాణాలకు అధికారులు సీల్ వేశారు. కాగా దుకాణం నంబర్ 4 కు సంబంధించి నిర్వాహకుడు కోర్టులో స్టే తేవడంతో స్వాధీనం నిలిపివేశారు. కార్యక్రమంలో సీఐ ఎం భీమానాయక్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈఓ నరసింహబాబు, భైరవకోన ఈఓ వంశీకృష్ణారెడ్డి, నర్రా నారాయణరెడ్డి, అంజనీదేవి, కొమ్మినేని వెంకట్రావు, గుర్రం వెంకటేశ్వర్లు, పసుపులేటి రఘురాం, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాల ఖాళీ సందర్భంగా వాదులాడుకుంటున్న అధికారులు, దుకాణందారులు

6న భుజంగేశ్వర ఆలయ దుకాణాలకు వేలం

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని పొట్టి శ్రీరాములువీధి, ప్రధాన కూడలిలో ఉన్న శ్రీవల్లీ భుజంగేశ్వర ఆలయ దుకాణాలను గురువారం ఖాళీ చేయించిన ఎండోమెంట్ ఏసీ పానకాలరావు..ఆ దుకాణాలకు వచ్చే నెల 6న వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ కార్యాలయంలో ఎండోమెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబుతో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వేనంబర్ 204/2లో ఆలయానికి 11 సెంట్ల స్థలం ఉందన్నారు. దానిలో 12 దుకాణాలు, స్వామికి కల్యాణ కైంకర్యాలు నిర్వహించే ప్రాంగణం ఉందన్నారు. ఆలయ స్థలంలో దుకాణాలను నిర్మించి కొందరు, కొనుగోలు చేసి కొందరు అన్యాక్రాంతం చేశార న్నారు. 2023 అమెండమెంట్ యాక్ట్ ప్రకారం అన్యాక్రాంతమైన స్థలాలు, ఆస్తులను స్వాధీనంచేసుకునేందుకు వారికి ఆగష్టులో వీక్లీనోటీస్, అక్టోబర్ 8న 15 రోజుల వ్యవధి నోటీసు ఇచ్చామని, అయినా వారు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో దుకాణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా మదన వేణుగోపాలస్వామికి చెందిన ఒక గది కూడా నవంబర్ 6వ తేదీన వేలం నిర్వహిస్తామని, వేలంలో ఎవరైనా పాల్గొని దుకాణాలను దక్కించుకోవచ్చని తెలిపారు.సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎండోమెంట్ ఏసీ పానకాలరావు

యానాదుల గుడిసెల పరిశీలన



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న వీఆర్‌ఓ

మర్రిపూడి: స్థానిక పంచాయతీ పరిధిలోని పొట్టిరెడ్డి పాలెం గ్రామశివారులో ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన చౌటూరి వెంకాయమ్మ, బాపట్లా కిశోర్ పూరి గుడిసెలను రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. సంఘటనకు కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. పూరి గుడిసెలో వెలుగుతున్న కొవ్వొత్తి పడి నిప్పులంటుకుని ప్రమాదవశాత్తు రెండు పూరి గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటనలో ఇంట్లో ఉన్న నిత్యవసర వస్తువులు, సామాన్లు, నగదు పూర్తిగా కాలిపోయినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రెండు గుడిసెలకు రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు తహసీల్దార్ జ్వాలా నరసింహారావు తెలిపారు. బాధితులను ఆదుకుంటామన్నారు. వీఆర్‌ఓ షేక్ బడేసాహెబ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

- కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి

పొన్నలూరు: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెరుకూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్ రికార్డులు, చిన్నారులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ సమయానుకూలంగా కేంద్రాన్ని తెరవాలన్నారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పనితీరు విషయంలో గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్త సుజాతకు సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అప్పుడప్పుడూ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును మెరుగుపరచాలని సూపర్‌వైజర్ రమాదేవికి సూచించారు. తహసీల్దార్ పుల్లారావు పాల్గొన్నారు.



చెరుకూరులో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

పామూరు: యోగా రాష్ట్రస్థాయి పోటీలకు పామూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జి.భోగేశ్వరరావు, పీడీ మస్తానీ తెలిపారు. స్థానిక పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలులో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జీహెచ్‌ఎస్ విద్యార్థులు కె.శాంతి, వి.రజిని, ఆర్.కళాంజలి, ఏ.మనీషా, పి.జుహా, జి.నందిని, జె.ప్రవల్లిక, ఎస్‌కే. సమీన్, ఎస్‌కే.సాదిక్ 9 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పీడీ మస్తానీని ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పామూరు: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు నోట్‌బుక్స్ సమకూర్చి అందజేయడం కొనియాడదగినదని ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రేగిచట్లపల్లె గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు తవ్వా మాల్యాద్రిరెడ్డి కుమారుడు తవ్వా ప్రకాష్‌రెడ్డి విగ్రహావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో తవ్వావిద్యాసాగర్‌రెడ్డి, కొండ్రెడ్డి రమణారెడ్డి, పలువురు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, దాతలు

సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

పొన్నలూరు: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేసి గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ సుజాత అన్నారు. మండలంలోని మాలపాడు సచివాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను, సచివాలయ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలకు జవాబుదారీగా ఉండి వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

కనిగిరి రూరల్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని అసిస్టెంట్ లేబర్ అధికారి సుబ్బారావు అన్నారు. రెవెన్యూ, పోలీస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పాన్ ఇండియా రెస్క్యూ, రిహాబిలిటేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరిత్యా నేరమన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ



విద్యార్థుల హాజరు, రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు గురువారం ఆకస్మికక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విధి నిర్వహణ, స్టాక్, మెనూ రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తరగతి గదులు, వసతి రూంలు, పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు క్రమశిక్షణతో చదవాలన్నారు. ఎస్‌ఓ అంజమ్మ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: కాలువలు పూడికతీత పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. పట్టణంలోని జరుగుతున్న ప్రధాన డ్రైనేజీ కాలువల పూడికతీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ 16వ వార్డులోని అన్ని ప్రధాన డ్రైనేజీల్లో పూర్తిగా పూడికతీత పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిలర్ పులి శ్రీను విజయలక్ష్మీ, శానటరీ ఇన్స్‌పెక్టర్ ఎస్‌కే నాయబ్‌రసూల్, సచివాలయ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం



కోటతిప్పలో రీసర్వేపై గ్రామ సభ

హనుమంతునిపాడు: భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లి పరిధిలోని కోటతిప్పలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామసభకు 139 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలు, పుస్తకాల్లో పేర్ల తప్పిదాలు, ఇతర సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. డీటీ కె.కిషోర్‌రెడ్డి, సర్వేయర్ రమణయ్య, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

కనిగిరి రూరల్: ప్రభుత్వం అమలు చేసే పశు సంక్షేమ పథకాలను, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక పశువర్ధక శాఖ కార్యాలయంలో గురువారం సామూహిక నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని, జాతీయ పశుగణన కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గొర్రెల పెంపకందారుల సంఘ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, పశు వైద్యశాల సహాయ సంచాలకుడు జి.శ్రీనివాసులరెడ్డి, సీఎస్‌పురం సంచాలకులు వి.రమేష్, మండల పశువైద్య శాఖాధికారులు బత్తుల బాలకృష్ణ, మున్నరు, సాయి, హనుమాసాహెబ్, ప్రశాంతి, చాంద్‌బాషా, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన

వీసీ పల్లి: మండల పరిధిలోని గుదేవారిపాలెం రైతు భరోసా కేంద్రంలో కంది, శనగ రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏడీఏ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆత్మ డీడీఏ సుబ్రహ్మణ్యేశ్వరరావు కందిలో సింగిల్ సూపర్ ఫాస్ట్ వాడటం వల్ల గింజ నాణ్యత బాగుందన్నారు. శాస్త్రవేత్త కేవీకే కో ఆర్డినేటర్ జి. రమేష్ మాట్లాడుతూ వెర్రి తెగులు, మరియు ఎండ తెగులు తట్టుకునేందుకు పాటించాల్సిన వాటిని వివరించారు. టి.శిల్ప, శరూఖ, పుల్లయ్య, కిషోర్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు

దశదిన కర్మకు హాజరైన ప్రముఖులు

మర్రిపూడి: మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి తల్లి వాకా పెద కోటమ్మ పెదకర్మకు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ డీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య హాజరయ్యారు. మండలంలోని గుండ్లసముద్రంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి నివాసంలో పెద కోటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వెంకటరెడ్డి కుటుంబసభ్యులతో మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, నేతలు తూమాటి తుమాటి నర్సింహారెడ్డి, బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, బోద రమణారెడ్డి, మాకినేని వెంకట్రావు, మాచేపల్లి నాగయ్య, ముండ్లమూరు, దొనకొండ, నాగులప్పలపాడు ఎంపీపీలు సునీత బ్రహ్మారెడ్డి, ఉషా మురళి, బుల్లెట్ కృష్ణారెడ్డి, కొండపి జెడ్పీటీసీ మారెడ్డి అరుణా వెంకటాద్రిరెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, కేవీ రమణారెడ్డి, రేగుల వీరనారాయణ, గొంటు హనుమారెడ్డి, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి ఉన్నారు.



పెద కోటమ్మకు నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్, ఇతర నేతలు

ఇష్టంతో చదివితే బంగారు భవిష్యత్

పామూరు: విద్యార్థి దశలో ఇష్టంతో చదివితే బంగారు భవిష్యత్ సొంతమవుతుందని కేజీబీవీ ఎస్‌ఓ కటకం సజన, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామ్‌భూపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక కేజీబీవీ బాలికా విద్యాలయంలో గురువారం విద్యాలయం ఎస్‌ఓ కె.సజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 2023-24 విద్యాసంవత్సరంలో కేజీబీవీలో 10వ తరగతి, కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యాలకు దాత, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామ్‌భూపాల్‌రెడ్డి తన సొంత నిధులతో ప్రోత్సాహక బహుమతులుగా మెమొంటో, ప్రశంసాపత్రాలను ఎంఈఓ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకోసం కృషి చేయాలన్నారు. విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెమొంటో, ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్‌ఓ, దాత

విద్యాభివృద్ధికి దాతలు చేయూత అభినందనీయం

వీసీపల్లి: విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు చేయూత నివ్వడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య అన్నారు. మండలంలోని పెద్ద వరిమడుగు పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి దాతలు బియ్యం అందజేశారు. పెదఇర్లపాడుకు చెందిన ఉండేలా నారాయణరెడ్డి, మరి వెంగళాయపల్లికి చెందిన కరణం మహాలక్ష్మయ్య రూ.7 వేల విలువైన బియ్యం, ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య రూ.10 వేల విలువైన బియ్యం అందించారు. దాతలను ఎంఈఓలు సంజీవ్, ఆర్ శ్రీనివాసరావు అభినందించారు. విద్యా కమిటీ చైర్మన్ మోతుకూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కాంచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బియ్యాన్ని అందజేస్తున్న దాతలు

బాలికల వసతి గృహం తనిఖీ

కనిగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని, సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని గురువారం కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో మెనూను పరిశీలించారు. విద్యార్థులలో కలిసి కూర్చొని అల్పాహారం తిన్నారు. వసతి గృహంలోని కిచెన్ రూంలు, తరగతి గదులను, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థల సేవల గురించి విద్యార్థినులకు వివరించారు. వసతి గృహంలోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి జయంతి, న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.



వసతి గృహంలో మెనూ పరిశీలిస్తున్న జడ్జి భరత్ చంద్ర

పారిశుధ్యంపై దృష్టి సారించండి

హనుమంతునిపాడు: పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో గురువారం సమీక్షించారు. పంచాయతీల్లో పనిచేసే క్లాప్‌మిత్రలు సక్రమంగా పనిచేటట్లు కార్యదర్శులు చూడాలన్నారు. పనిచేయని వారిని తొలగించి పనులు చేసేవారిని నియమించాలన్నారు. ఇళ్లలో నుంచి వచ్చే తడి, పొడి చెత్తను ప్రతిరోజు డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. పారిశుధ్యం అధ్వానంగా లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురిసి నీరు నిల్వ ఉన్న నేపథ్యంలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, పంచాయతీ విస్తరణ అధికారి హనుమంతరావు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ, వైద్యాధికారి

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పొన్నలూరు: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించి అంటువ్యాధులు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల, మాలపాడు కేజీబీవీ విద్యాలయంలో గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ పరిశుభ్రమైన ఆహారం తీసుకోని మంచినీటిని తాగాలన్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల డయేరియా, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకుతాయన్నారు. వసతి గృహాల పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచి, దోమల వ్యాప్తి నివారణకు బ్లీచింగ్ చల్లించాలన్నారు. అనంతరం విద్యార్థులకు మాత్రలు అందజేశారు. ఏఎన్‌ఎం హరిత, ఆశా కార్యకర్త నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

హనుమంతునిపాడు: పోలీస్ అమరవీరుల దినోత్సవాలను పురస్కరించుకొని స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. ఎస్సై ఎం మాధవరావు, ఎస్‌ఓ అంజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాహిత కార్యక్రమాలు అభినందనీయం

కనిగిరి రూరల్: మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవాహిత కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. వాగిచర్ల వెంకటేశ్వర్లు, గ్రంధి శ్రీకాంత్, లక్ష్మీ ప్రతిమ, గ్రంధి వెంకట సూర్య సాయి నికేత్‌ల ఆర్థిక సౌజన్యంలో స్థానిక గురుగుల పాఠశాలలోని సుమారు 100 మంది విద్యార్థులకు గురువారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన గఫార్ మాట్లాడుతూ మానవతా శాఖ మరిన్ని సేవాహిత కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాత వాగిచర్ల వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ గురుస్వామిరెడ్డి, పసుపులేటి అరుణోదర్, పసుపులేటి వాణి, కనమర్లపూడి లక్ష్మీ మోహన్, మాటూరి వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే ఖాజావలి